క్లుప్తంగా

రంగంపేట ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు



ఆశ్రమంలోని శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఆశ్రమంలో శ్రీ గురు కృష్ణానంద సరస్వతీ స్వామివారి ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటిరోజు ఆశ్రమ సన్నిధానంలో గణపతి పూజ, శివలింగానికి పంచామృతలతో అభిషేకం కార్యక్రమాలను ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి వారి ఆధ్వర్యంలో కొనసాగించారు. ఈ ఆరాధనోత్సవాలకు వివిధ ప్రాంతాల భక్తులు హాజరయ్యారు.

సన్మానం



ఎంఈఓను సన్మానిస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండల విద్యాధికారిగా నియమితులైన యాదగిరిని మంగళవారం పీఆర్‌టీయూ టీఎస్ వెల్దుర్తి మండల శాఖ తరఫున ఘనంగా సన్మానించారు. అదే విధంగా నోడల్ అధికారి సీతారాములు, బండపోసాన్‌పల్లి హెచ్ఎం శాంతయ్యను ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించారు. అంతకు ముందు సంఘం వెల్దుర్తి మండల శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి, సంఘమేశ్వర్‌తో పాటు జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో సూరారం మల్లారెడ్డి ఆస్పత్రి వైద్య సిబ్బంది మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఆస్పత్రి డాక్టర్ ప్రశాంత్, దీక్షిత సిబ్బంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

శబరిమలకు స్వాములు



శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో మంగళవారం అయ్యప్ప ఇరుముడి కార్యక్రమాన్ని హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప మాలదారులు గురుస్వామి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, అయ్యప్ప పూజ, ఇరుముడి నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో అన్నదానం చేసి, స్వాములు శోభయాత్రతో శబరిమలకు బయలు దేరారు. కార్యక్రమంలో పురోహితులు వేలేటి లక్ష్మణశాస్త్రి, గురుస్వాములు రవీందర్, నవీన్ రెడ్డి, భీమయ్య, లింగం గౌడ్, ఎర్రగౌడ్, శ్రీనివాస్ గౌడ్, స్వామి గౌడ్, లక్ష్మాగౌడ్, సతీష్, శ్రవణ్, వీరమల్లు బాలయ్య, వెంకటేశం, రమణ, రంజిత్‌గౌడ్, యాదగౌడ్, అయ్యప్ప స్వాములు, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ వేగవంతం

చిన్నశంకరంపేట(మెదక్): అభయాస్తం డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి విజయశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎంపీడీఓ ప్రవీణ్‌తో కలిసి డేటా ఎంట్రీ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ గిరిధర్ రెడ్డి, ఆర్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.

22న సెలవు దినంగా ప్రకటించండి

పెద్దశంకరంపేట(మెదక్): అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. మంగళవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. 22న రామ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉన్నందున అందరూ వాటిని వీక్షించేందుకు సెలవును ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

ప్రతీ కుటుంబం 22న పూజలు చేయాలి



శివ్వంపేట(నర్సాపూర్): చండిలో అక్షింతల ఊరేగింపు



చిన్నశంకరంపేట(మెదక్): ఖాజాపూర్‌లో అయోధ్య అక్షింతల శోభయాత్రలో భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభించడంతో ప్రతీ కుటుంబం పూజలు చేయాలని హనుమాన్ భక్తులు గ్రామస్తులను కోరారు. మంగళవారం మండలంలోని బూరుగడ్డ, కంచన్‌పల్లి, నాగ్సాన్‌పల్లి, దేవులపల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులకు అక్షింతలను పంపిణీ చేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో అయోధ్య రామ మందిర అక్షింతల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, హిందు భక్తులు, గ్రామస్తులు ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): శ్రీరామక్షేత్ర తీర్థ అక్షింతల పంపిణీ కొనసాగుతోంది. పెద్దశంకరంపేటలోని ఆయా కాలనీల్లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్, కుమ్మరిపల్లి గ్రామాల్లో శ్రీరామతీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఇంటింటికీ అందించారు. శ్రీరామతీర్థ ట్రస్ట్ బాధ్యుడు పాతూరి లక్ష్మాగౌడ్, సర్పంచ్ కుంట నాగలక్ష్మి, ఉప సర్పంచ్ ఉపేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తిగుల్ల స్వామి, బాలయ్య, జగన్, సాయికుమార్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో అక్షింతల పంపిణీ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో అయోధ్యరామ మందిర అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, వార్డు మెంబర్లు భూపాల్, రవి, విశ్వహిందూ పరిషత్ మండల కార్యవాహ సురేశ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.



చేగుంటలో అక్షింతల వితరణ చేస్తున్న భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): నాగ్సాన్‌పల్లిలో ..

గ్రామాల స్వచ్ఛతే లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల స్వచ్ఛత, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని చెట్లగౌరారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నర్సయ్యల కోరిక మేరకు గ్రామంలో పలు వీధుల్లో అండర్ డ్రైనేజీ పనుల కోసం పరిశీలించినట్లు తెలిపారు. ఈ పనుల కోసం జెడ్పీ నిధులు ద్వారా రూ. 15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల్లో ఈ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ మధు, దండుపల్లి ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, నాయకులు మహబూబ్ రెడ్డి, నర్సింలు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చెట్లగౌరారంలో వీధులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో దివ్యంగ విద్యార్థులను గుర్తించడానికి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలోని విద్యార్థులను పరీక్షిస్తున్నట్లు ఐఈ సీఎంఓ సతీశ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు నందిగామ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులను గుర్తించడానికి సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో ఇన్‌క్లూజివ్ ఏడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ సర్వేలో పాఠశాలలో విద్యార్థుల దివ్యాంగులను గుర్తిస్తున్నట్లు వివరించారు. అలాగే వారికి సరైన సలహాలు, సూచనలు ఇస్తున్నామని అన్నారు. వీటిని పాఠశాల లాగ్ఇన్‌లో కూడా అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో విద్యార్థులను గుర్తిస్తున్న అధికారులు

ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేయండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎస్టీటీయూ వినతి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రాథమిక విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని కోరుతూ సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ తరఫున సీఎం రేంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంల పోస్టులను మంజూరు చేయాలని, గ్రామ పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమిక్, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలన్నారు. పదోన్నతులు, బదిలీలు పూర్తిచేసి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడంతో పాటు 317 జీఓతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి అంజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీటీయూ నాయకులు

సస్యరక్షణ చర్యలతోనే పంటలు భద్రం

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పంట సాగులో సరైన జాగ్రత్తలు, నివారణ చర్యలు పాటిస్తేనే పంటలు భద్రంగా ఉండడంతో పాటు, అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బాల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని అంతారం గ్రామంలో వరి పంటలు పరిశీలించి, రైతులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వాతావరణం చల్లగా ఉన్నందున, పొలంలో నీటిని ఎప్పటికప్పుడు తీసేస్తూ ఉండాలని, అదేవిధంగా పొలంలో ఏదైనా తుప్పు పట్టిన మచ్చలు పరిశీలించినట్లయితే జింక్ సల్ఫేట్ 2 గ్రాములు, లీటర్ నీటిలో కలిని పిచికారీ చేయాలన్నారు. సహజ ఎరువులను వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

మొక్కజొన్న పంటపై అవగాహన

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో రైతులకు మొక్కజొన్న పంటల సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం జీడిమెట్ల సహాయ సంరక్షణ అధికారి రవిశంకర్ రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న పంట కోసం ముందుగా విత్తన శుద్ధి ముఖ్యమైన అంశంగా గుర్తించాలని రైతులకు సూచించారు. విత్తనం నాటిన నుంచి 14 వారాల కాలం పంట చివరి వరకు చేపట్టాల్సిన సస్యరక్షణ గురించి వివరించారు. గ్రామం నుంచి 10 మంది మహిళా రైతులను విత్తన శుద్ధి శిక్షణ కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఏఈఓ మాధవితో పాటు రైతులు పాల్గొన్నారు



చిలప్‌చెడ్(నర్సాపూర్): అంతారంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి



చేగుంట(తూప్రాన్): మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రవిశంకర్

రోబోటిక్ ఎక్స్‌పో ఇన్నోవేటివ్ ఫెస్ట్ ప్రారంభం

ప్రదర్శనలతో నైపుణ్యం చాటుకున్న విద్యార్థులు

రేగోడ్(మెదక్): మోడల్ పాఠశాలలో మంగళవారం రోబోటిక్ ఎక్స్ పో ఇన్నోవేటివ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు చోటుమియా ప్రారంభించారు. అనంతరం రోబోటిక్స్‌తో పాటు సైన్స్, ఆర్ట్స్, లాంగ్వేజెస్, ఒకేషనల్ సబ్జెక్టులకు సంబంధిచిన పలు మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. వాటిని చూసి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో మోడల్ స్కూల్ ఏర్పాటు చేసింది మంత్రి దామోదర రాజానర్సింహ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జయప్రకాశ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రాథమిక పాఠశాల చైర్మన్ దశరథం, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పిర్యానాయక్, నాయకులు శివకుమార్, గాండ్ల నర్సింలు, మోహన్ పాల్గొన్నారు.



ఫెస్ట్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు

పెండింగ్ ఈ-చలాన్‌లపై రాయితీ నేడే ఆఖరు

నిజాంపేట(మెదక్): మండల ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఈ – చలాన్‌లపై భారీ రాయితీలను ప్రకటించారు. ఈ అవకాశం 10న జనవరి 2024తో ముగియనున్న సందర్భంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ ఈ – చలాన్ రాయితీని సద్వినియం చేసుకోవాలని మండల ప్రజలకు సూచించారు.

కార్మికుల జీతాల్లో కోత

మనోహరాబాద్(తూప్రాన్): నిత్యం గ్రామ పరిశుభ్రతకు తాము పాటు పడుతుంటే సమయపాలనంటూ తమకు వచ్చే జీతాల్లో పంచాయతీ కార్యదర్శి కోత పెడుతున్నాడని, దీంతో ఎలా బతకాలని గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. నిత్యం మురుగులో పని చేస్తున్న తమకు సమయపాలన పేరుతో వచ్చే రూ.10 వేలలో మూడు, నాలుగు వేలు కోత విధిస్తున్నాడన్నారు. ఇదేంది సారూ అని అడిగితే దుర్భషలాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సర్పంచ్ నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. కార్మికుల వేతనాలను కార్యదర్శి కోత విధించాడని, ఇలా వద్దని వారు ఇబ్బందులకు గురవుతారని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. పంచాయతీ విధుల ప్రకారం సమయపాలన పాటించడం లేదని, చెప్పపెట్టకుండా దుమ్మాలు కోడుతున్నారన్నారు. పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, అందుకే జీతాల్లో కోత విధించానన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



జుకల్‌లో వికసిత్ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని సంకాపూర్ గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంకాపూర్ సర్పంచ్ సుజాత, వికసిత్ భారత్ నోడల్ అధికారి, ఏపీజీవీబీ మేనేజర్ అశోక్, ఎస్ఐసీ ఆఫీసర్ మోహన్‌రావు, డాక్టర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఉసిరికపల్లి, కొత్తపేట, పిల్లుట్ల, రెడ్యా తండాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంకల్ప యాత్ర మండల ఇన్‌చార్జి అశోక్, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): వికసిత్ భారత్‌లో భాగంగా మండల పరిధిలోని జూకల్ గ్రామంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్ర పథకాలను ప్రజలకు అధికారులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు శ్రావణ్, కృష్ణ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): ఉసిరికపల్లిలో అగ్రిగోన్ పిచికారీపై అవగాహన



చిన్నశంకరంపేట(మెదక్): సంకాపూర్‌లో..

ఘనంగా ఎల్లమ్మకు బోనాల ఊరేగింపు



ఎల్లమ్మకు బోనాలు ఊరేగిస్తున్న భక్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో రేణుకా ఎల్లమ్మ బోనాల ఊరేగింపు రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వల్దాస్ మల్లేశ్‌గౌడ్, గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్దకు గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకొని ఎల్లమ్మకు ఓడి బియ్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం బోనాల ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నవీన్ గౌడ్, అరవింద్ గౌడ్, ఉదయ్ గౌడ్, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **క్రాంతికారి సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి**



నర్సాపూర్‌రూరల్: గోర్ బంజారాల ఆరాధ్యా దైవం క్రాంతి కారి సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని ఉమ్మడి మెదక్ జిల్లా గోర్ సేనా అధ్యక్షుడు రమేశ్ నాయక్ రాథోడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నర్సాపూర్ క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే సునీతారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా గోర్ సేనా ఇన్‌చార్జి సురేశ్ రాథోడ్, దేవిదాస్ రాథోడ్, సభ్యులు రాజు బానోత్, జైపాల్ రాథోడ్, పర్లాల్ బానోత్, శంకర్ రాథోడ్, రామ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆలయం నిర్మిస్తే బెదిరిస్తున్న ఆర్ఐ**

అల్లాదుర్గం(మెదక్): భక్తుల చందాలతో ఆలయం నిర్మిస్తే, దేవాలయం నిర్మాణానికి ఎవరు అనుమతి ఇచ్చారని, ఎలా నిర్మించారని అల్లాదుర్గం ఆర్ఐ బెదిరిస్తున్నారని మాజీ ఎంపీటీసీ బసన్నగారి అనూరాధ పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భక్తుల సహాయ సహకారాలతో నర్సింహస్వామి ఆలయం నిర్మించామని తెలిపారు. ఆర్ఐ పాతి విచారణకు ఆలయం పక్కన ఉన్న భూములను చూడటానికి వచ్చి, గుడి విడియో తీసి అక్కడే ఉన్న తనను ఎలా నిర్మించారని అనవసరంగా ప్రశ్నించారని వాపోయారు. ఎలాంటి ఫిర్యాదు లేకున్నా.. ఆర్ఐ ఎందుకు వచ్చారో తెలియడం లేదని, ఎదైన ఆశించి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హిందూ ఆలయాలు నిర్మిస్తేనే అధికారులకు అభ్యంతరాలు గుర్తుకు వస్తాయని, ఇతర మతస్తులు అక్రమంగా ప్రభుత్వ భూములు కబ్జా చేసి నిర్మిస్తే ఫిర్యాదు చేసిన పట్టించుకోరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ సతీశ్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. ఆర్ఐని తాను విచారణకు పంపలేదని చెప్పారు.

◆ **ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం... కాయల్స్ చోరీ**



రామాయంపేట(మెదక్): మండలంలోని ఝాన్సీ లింగాపూర్, అక్కన్నపేట మధ్యలో సోమవారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన దుండగులు అందులో ఉన్న కాయల్స్ చోరీ చేశారు. ఈ సంఘటనలో కనీసం ముగ్గురు వ్యక్తులు పాల్గొని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కాయల్స్‌తో పాటు ఆయిల్‌ను కూడా దుండగులు ఎత్తుకెళ్లారని పోలీసులు తెలిపారు. ఎస్ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

◆ **మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక**

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ద్వారకా గార్డెన్స్‌లో జిల్లా మత్స్య శాఖ అధికారి బి.నరసింహరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో చీఫ్ ప్రమోటరుగా రాంకిష్టయ్య, డైరెక్టర్లుగా పెంటయ్య(అచ్చంపేట), కృష్ణ(రాజిపేట), అంగని దుర్గేష్(మెదక్), బాగయ్య(బద్దారం), స్వామి(శేరిపల్లి), గడప దేవేందర్(తూప్రాన్), నర్సింలు(కుర్తివాడ), శ్రీనివాస్(అచ్చంపేట), అంజయ్య(బొడ్మట్‌పల్లి), బాగయ్య(నాగాపూర్) ఎన్నికైనట్లు మత్స్యశాఖ అధికారి నరసింహ తెలిపారు.

◆ **సమగ్రంగా వివరాలు నమోదు చేయండి**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో అన్ని శాఖల సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

◆ **వైభవంగా కలేట్ల మల్లన్న జాతర**



నర్సాపూర్ రూరల్: మండలంలోని నారాయణపూర్‌లో మంగళవారం శ్రీ కలెట్ల మల్లన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలతో పాటు ప్రత్యేక అలంకరించారు. నారాయణపూర్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మల్లన్న స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బండ్లు, బోనాలు ఊరేగించారు. ఒగ్గు కళాకారులు మల్లన్న కథలు భక్తులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు గౌడ్ పాల్గొన్నారు.